సాక్షి గుంటూరు

గురువారం । 22 । ఆగస్టు । 2024



నేడు రామాలయ పునఃప్రతిష్ట

నాదెండ్ల: చిరుమామిళ్ల నడింబజారులో రూ.60 లక్షలతో నిర్మించిన శ్రీ రామమందిరంలో విగ్రహ పునః ప్రతిష్టా మహోత్సవం గురువారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



నీలంపాటి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

శావల్యాపురం: కనమర్లపూడిలోని శ్రీ నీలంపాటి అమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మూల విరాట్‌ను అలంకరించి పూజలు చేశారు.

నేడు లక్ష్మీగణపతి హోమం



దాచేపల్లి : స్థానిక శ్రీ బీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో గురువారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యుడు యలమల నరేష్ తెలిపారు. దీంతో పాటు చండీ హోమం కూడా జరుగుతుందని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

న్యూస్‌రీల్

చేపలకు వల వేస్తే కొండచిలువ చిక్కింది



ప్రత్తిపాడు: చేపలకు వల వేస్తే అందులో కొండ చిలువ చిక్కింది. ప్రత్తిపాడుకు చెందిన చెర్లోపల్లి శ్రీనివాస్ స్థానిక రామవాగులో చేపలు పట్టేందుకు బుధవారం ఉదయం వల విసిరాడు. అందులో ఓ చేపతో పాటు తొమ్మిది అడుగుల కొండచిలువ చిక్కుకుంది. గమనించిన జాలరి విషయాన్ని స్థానికుల ద్వారా పోలీసులకు తెలియజేశాడు. ఎస్‌ఐ కె. నాగేంద్ర అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి కొండ చిలువను స్వాధీనం చేసుకుని, నడింపాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలేశారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ యాజమాన్యాలలోని అన్ని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.ఎం.ఏ.హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.50 లక్షలు లోపు ఉన్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని వివరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు సెప్టెంబర్ 6వ తేదీ, పరీక్ష రుసుం చెల్లించేందుకు సెప్టెంబర్ 10వ తేదీ తుది గడువు అని తెలిపారు. పరీక్ష డిసెంబర్ 8వ తేదీన నిర్వహిస్తారన్నారు. పరీక్ష రుసుం ఇతరులు రూ.100 , ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50ను ఆన్‌లైన్‌లో ఎస్‌బీఐ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలని తెలిపారు.

వైభవంగా శివుడి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



మంగళగిరి : పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శివుడి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. శివుడి విగ్రహాన్ని దాతలు మాదల వేంకటేశ్వరరావు, అంజమ్మ దంపతులు మూడేళ్ల కిందట ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాదల గోపీకృష్ణ, భోగి కోటేశ్వరరావు, తులిమిల్లి రామకృష్ణ, నిరీష, వెంకటకృష్ణ, రమ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి-విజయవాడకు కొత్త ఆర్టీసీ బస్సు



సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సత్తెనపల్లి-విజయవాడ రూట్‌కు నూతన ఆర్టీసీ బస్సును స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రారంభించారు. అనంతరం నాయకులతో కలిసి బస్సు ఎక్కి మొదటి టికెట్ కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ.కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అటవీ జాతి మొక్కలతో అదనపు ఆదాయం

సత్తెనపల్లి: వ్యవసాయ భూమిలో అటవీ జాతి మొక్కలు నాటితే అదనపు ఆదాయం లభిస్తుందని టీఓఎఫ్‌ఏ ప్రోగ్రాం రాష్ట్ర అసోసియేట్ మారపల్లి ప్రణీత్‌వర్మ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం భృగుబండ గ్రామంలో అటవీయేతర ప్రాంతంలో బుధవారం చెట్ల పెంపకంపై రైతులకు నిర్వహించిన శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు ఆగ్రో ఫారెస్ట్ మీద అవగాహన, శిక్షణ నిర్వహించారు. అటవీజాతి మొక్కలను వ్యవసాయ భూముల్లో నాటితే వాటి వల్ల వచ్చే ఉపయోగాలు, అదనపు ఆదాయం గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ వీఏఏ జీవనజ్యోతి పాల్గొన్నారు.

డెల్టా ఉల్టా

- బ్రాంచి కాల్వల చివరి భూములకు అందని సాగునీరు
- హై లెవల్, అప్పాపురం చానల్ పరిధిలో ఇదే దుస్థితి
- సముద్రంలోకి వృథాగా పోతున్న నీరు
- సాగుకు ఇవ్వలేని ప్రభుత్వం
- మండుతున్న ఎండలతో ఎండుతున్న పొలాలు
- మోటార్లతో పంటలను తడుపుకుంటున్న రైతన్నలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని సర్కార్



పెదనందిపాడు పమిడివారిపాలెంలో ఎండిపోయి, నెర్రలిచ్చిన వరిచేను



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఉమ్మడి గుంటూరు జిల్లాలో కృష్ణా డెల్టా పరిధిలో వరి పంట ఎండిపోతోంది. ఒక పక్క ఆగస్టులో కూడా మండుతున్న ఎండలు, సరైన ప్రణాళిక లేని ప్రభుత్వ తీరుతో రైతన్న నష్టపోతున్నాడు. కృష్ణా నదిలో కావాల్సినంత నీరు ఉంది. లక్షల క్యూసెక్కులు వృథాగా సముద్రంలో కలిసిపోతోంది. అయినా రైతులకు అవసరమైన సాగునీటిని అందించడంలో ప్రభుత్వం విఫలం చెందింది. తెనాలి, పొన్నూరు, వేమూరు, రేపల్లె, పత్తిపాడు నియోజకవర్గాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోతోంది. నీరందక భూములు నెర్రలిచ్చాయి. వేల ఎకరాల్లో పంట పనికిరాకుండా పోయే పరిస్థితి నెలకొంది. ఎన్నడూ లేనివిధంగా ఈ నెలలో సాధారణ ఉష్ణోగ్రత కంటే నాలుగైదు డిగ్రీలు అదనంగా నమోదవుతోంది. దీంతో పొలాలకు అందుతున్న నీరు సరిపోవడం లేదు. ఎండలకు ఆవిరవుతోంది.

అప్పాపురం చానల్ పరిధిలో ఎండుతున్న పైర్లు



కాకుమాను వద్ద మోటార్లతో పొలాలకు నీరు

అప్పాపురం చానల్ పరిధిలో కూడా నీరందని పరిస్థితి ఉంది. పెదనందిపాడు, కాకుమాను మండలాల పరిధిలో వందలాది ఎకరాల పంటలు నీరు అందక ఎండిపోతున్నాయి. కాలవలో తక్కువ నీరు వస్తుండటంతో రైతులు ఆయిల్ ఇంజన్లు పెట్టి తోడుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే ఖర్చులతో అల్లాడుతున్న రైతులు అదనపు పెట్టుబడితో సతమతమవుతున్నారు.

నీటిని తోడేస్తున్న ఎగువ రైతులు

హైలెవెల్ చానల్ పరిధిలోని సాగు భూములు అన్నింటికీ నీటి సరఫరా జరగడం లేదు. చానల్ నుంచి పంట పొలాలకు నీరందించే బ్రాంచి కాల్వల నుంచి ఎగువ రైతులు ఆయిల్ ఇంజిన్లతో తోడేసుకుంటున్నారు. రైతుల ఆందోళనతో హడావుడిగా కాల్వల్లో పైపులు తీసేయించిన అధికారులు, ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. హైలెవెల్ చానల్‌కు పూర్తి స్థాయిలో నీటి సరఫరా ఇస్తున్నా ఫలితం లేదు. ఎగువ భూముల రైతులు తోడేస్తుండటంతో కాల్వ చివరి భూములకు నీరు అందడం లేదు. అసలే వేసవిని తలపిస్తున్న ఎండలతో పంట పొలాల్లో చుక్క నీరు లేదు. వరి పైరు నిట్టనిలువునా ఎండిపోతోంది. చానల్ 2, 3 నంబర్ల బ్రాంచి కాల్వల పరిధిలో తెనాలి రూరల్ మండలం కొలకలూరు నుంచి నంబూరు వెళ్లే డొంక పొలాల్లో, హాఫ్‌పేట దగ్గరలోని ఖాజీపేట పంట పొలాల్లోనూ ఈ పరిస్థితి కనిపిస్తోంది.



హైలెవెల్ చానల్ నంబరు 2 బ్రాంచి దిగువన ఎండుతున్న వరి చేను

ప్రస్తుతం వరి పైరు 45 రోజుల దశలో ఉంది. ఇక్కడ దాదాపు రైతులంతా వెద పద్ధతిలోనూ సాగు చేస్తున్నారు. దుక్కులు, విత్తనం వెదజల్లడం, కలుపు మందుల పిచికారీకి రైతులు ఎకరాకు రూ.6 వేల దాకా పెట్టుబడి పెట్టారు. ఇప్పుడు అంతా వృథా అయింది.

బ్రాంచి కాలువలకు అరకొరగా నీరు



కొల్లూరు మండలం చినపులివర్రు సమీపంలో పంట కాలువ దుస్థితి

పశ్చిమ బ్యాంక్ కెనాల్ పరిధిలో కూడా శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదు. కాలవ కట్టలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సామర్థ్యం మేరకు నీటిని ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. వేమూరు, కొల్లూరు, వెల్లటూరు, రేపల్లె, ఇసుకపల్లి (రేపల్లె) సెక్షన్ల ద్వారా వివిధ బ్రాంచి కాలువలకు నీరు అరకొర వస్తోంది. ఆయకట్టు ఆరంభంలోనే రైతులు నీటికి అడ్డుకట్టలు వేస్తున్నారు. దిగువకు వెళ్లకుండా నిలకట్టి తమ పొలాలకు మళ్లించుకుంటుండటంతో అధిక శాతం పంట భూములకు అందడం లేదు. కొల్లూరు మండలంలోని చినపులివర్రు, కోటిపల్లి, తాడిగిరిపాడు, రావికంపాడు, బొద్దులూరుపాడు, కొల్లూరు, వేమూరు మండలంలోని పెనుమర్రు, చావలి, అబ్బనగూడవల్లి, కోడిపర్రు, భట్టిప్రోలు, చెరుకుపల్లి, రేపల్లె మండలాల్లో నీరందక పంటలు ఎండిపోతున్నాయి. అవసరమైన చోట కొమ్మమూరు కాలువ, నాలాల నుంచి నీటిని ఆయిల్ ఇంజన్ల ద్వారా నీరు అందిస్తే కొంతమేర రైతుల్ని ఆదుకోవచ్చు. వందలాది ఎకరాలు పంట ఎండిపోతున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుండెలు తరుక్కుపోతున్నాయి



వరి పంటకు సాగు నీరు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కాలువల ద్వారా దిగువకు రావడం లేదు. కాలువ గట్లపై పడి గాపులు కాయాల్సి వస్తోంది. తీరా అష్ట కష్టాలు పడి పంటకు నీరు పెట్టుకుంటే తీవ్ర ఎండలు వల్ల ఆవిరై పోతోంది. పొద్దు గడిచి తెల్లవారే సరికి పొలంలో చుక్క నీరు ఉండడంలేదు. కాలువ పూడిక వల్ల పల్లపు ప్రాంతాలలోని పొలాలకు నీరందడంలేదు. కళ్ల ముందే పంటలు ఎండిపోతుండటంతో గుండెలు తరుక్కుపోతున్నాయి.

– నవరాల మధుసూదనరావు, రైతు, చినపులివర్రు, కొల్లూరు మండలం

గిడసబారుతున్న పంట



కాలువ ద్వారా వచ్చే నీరు పొలాల్లోకి ఎక్కడం లేదు. ఆయిల్ ఇంజన్లు, విద్యుత్తు మోటార్ల సాయంతో నీరు పెట్టినా ప్రయోజనం ఉండటం లేదు. కాలువ వెంబడి పొలాల పరిస్థితే ఇలా ఉంటే లోపలి వాటి సంగతి చెప్పే పనిలేదు. ఆయిల్ ఇంజన్లతో నీరు పెట్టుకోవడంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఇంత కష్ట పడుతున్నా విపరీతమైన ఎండల కారణంగా పంట ఎదుగుదల లేదు. కళ్ల ముందే ఎండిపోతుండటంతో దుఃఖం ఆగడంలేదు.

– కొలుసు ఉమామహేశ్వరరావు, రైతు, కొల్లూరు శివారు యాదవపాలెం.

సాగునీరు అందించాలి



ఈ ఏడాది ఐదెకరాల్లో వరి సాగు చేశా. వర్షాలు లేక పంట ఎండిపోతోంది. ఇటు కాలువల ద్వారా సాగు నీరు కూడా రాలేదు. తొలుత సకాలంలో వర్షాలు కురిసినా ప్రస్తుతం వాతావరణం అనుకూలించక పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి సాగు నీరు అందించాలి.

– ముప్పలనేని సత్యనారాయణ, రైతు, పమిడివారిపాలెం

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



నిందితులతో గుంటూరు సీసీఎస్, పెదనందిపాడు పోలీసులు

ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 100కు పైగా కేసులు

నగరంపాలెం: ఇళ్లల్లో చోరీలకు పాల్పడే అంతర్‌ రాష్ట్ర దొంగల ముఠా గుట్టును గుంటూరు సీసీఎస్ పోలీసులు ఛేదించారు. గుంటూరు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేసి, రూ.4.94 లక్షలు విలువ చేసే బంగారు, వెండి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాలులో కేసుల వివరాల్ని పెదనందిపాడు పీఎస్ ఎస్‌ఐ టి.రాజ్‌కుమార్ వెల్లడించారు. గత నెలలో వరగానిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. దీనిపై పెదనందిపాడు పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సీసీఎస్ డీఎస్పీ ఎ.శివాజీరాజు పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ వెంకన్నచౌదరి దర్యాప్తు ముమ్మరం చేశారు. అబ్బినేని గుంటపాలెం అడ్డరోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం గుంటూరు రూరల్ మండలం గోరంట్ల గ్రామానికి చెందిన చిల్లర సురేష్, జల్లేపల్లి వెంకటేశ్వరరావు, ముత్యాల అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో వరగానితో పాటు పశ్చిమ గోదావరి జిల్లాలో ఐదు ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు ముగ్గుర్ని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ తెలిపారు. వారి నుంచి రూ.4.94 లక్షల విలువ చేసే బంగారు, వెండి సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ సీఐ వెంకన్నచౌదరి, పెదనందిపాడు పీఎస్ ఎస్‌ఐ టి.రాజ్‌కుమార్, సీసీఎస్ ఏఎస్‌ఐ పి.ఎస్.రామకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ కె.పీటర్‌రాజు, పీసీ డి.ఆదినారాయణ, హోంగార్డు వీరయ్య, పెదనందిపాడు పీఎస్ ఎస్‌ఐ టి.రాజ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఈ.రాము, పీసీ మహబూబ్ సుభానీలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

పదహారేళ్లకే దొంగతనాలు

చిల్లర సురేష్ చోరీలు చేయడంలో నేర్పరి. అతను 16 ఏళ్ల వయసు నుంచే వీటికి అలవాటు పడ్డాడు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో సుమారు 100కి పైగా చోరీ కేసులు నమోదై ఉన్నాయి. అనేకమార్లు జైళ్లకు వెళ్లాడు. పగటివేళ తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీలు చేయడంలో దిట్ట. ఇటీవల రాత్రిళ్లు దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. జైలు నుంచి విడుదలైన ప్రతిసారీ ఒక ముఠాను ఏర్పాటు చేస్తాడు. వీరంతా కలిసి ఇనుపరాడ్లు, గడ్డపారలు, గ్యాస్‌కట్టర్ సాయంతో ఇళ్లు, దుకాణాల్లో చోరీలకు పాల్పడే వారు. గతనెల 12న జైలు నుంచి విడుదలై, అదే గ్రామానికి చెందిన జల్లేపల్లి వెంకటేశ్వరరావు, ముత్యాల అనిల్‌ను ముఠాగా ఏర్పరచుకున్నాడు. గత నెల 15న వరగానిలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆ తర్వాత చింతలపూడి, ఏలూరు జిల్లాలోని ధర్మాజీగూడెం పీఎస్ పరిధిలో, పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు తెగబడ్డారు. జల్లేపల్లి వెంకటేశ్వరరావుపై గతంలో కొట్లాట కేసులు ఉన్నాయి. తొలిసారి చిల్లర సురేష్‌తో కలిసి ఇళ్లల్లో చోరీలకు అలవాటుపడ్డాడు. ముత్యాల అనిల్ భార్యతో విడిపోయి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో చిల్లర సురేష్‌తో జతకట్టాడు.

యార్డుకు 53,961 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 53,961 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 52,234 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,800 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,500 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 24,572 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

కాలం తీరినా రైట్..రైట్

నిబంధనలు పాటించాల్సిన ప్రభుత్వ అధికారులే వాటికి తిలోదకాలిస్తున్నారు. పదిహేనేళ్లు పైబడిన వాహనాలకు కాలం చెల్లినట్లే లెక్క. అయితే, పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ఏళ్ల తరబడి తిరుగుతున్న వాహనాల్ని స్క్రాప్‌కు తరలించాల్సిన ఆర్టీఏ అధికారులు కూడా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

- ప్రభుత్వ వాహనాలపై దృష్టి సారించని ఆర్టీఏ అధికారులు
- జిల్లాలో 1,350 పైగా 15 సంవత్సరాలు పైబడిన వాహనాలు
- 500పైగానే 25 ఏళ్లు దాటిన వాహనాలు
- 15 ఏళ్లు దాటితే నో రెన్యువల్
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చిన నిబంధనలు
- కేవలం స్క్రాప్‌కు 100లోపు మాత్రమే వాహనాలు



జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తిరుగుతున్న పాత వాహనం

పట్నంబజారు: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాలం చెల్లిన ప్రభుత్వ వాహనాలకు రెన్యువల్ చేయకూడదనే స్పష్టమైన నిర్ణయాన్ని ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమలు కావాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. దీనిపై రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. అయితే, వాటిని పట్టించుకున్న దాఖలాలేదు. కనీసం జిల్లాలో 100 వాహనాలు కూడా స్క్రాప్‌కు చేరలేదంటే.. పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆదేశాల్ని అధికారులే పట్టించుకోకపోతే ఇక సామాన్యులు తిరిగే వాహనాల సంగతేమిటో అర్థం కాకుండా ఉంది. వాహనం పదిహేనేళ్లు తిరిగిన తర్వాత ఐదు సంవత్సరాల చొప్పున కండిషన్‌ను బట్టి రెన్యువల్ చేసుకునే సదుపాయం ఉంది. అయితే, ఈ సదుపాయాన్ని ప్రభుత్వ వాహనాలకు కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఆర్టీఏ అధికారుల వద్ద స్పష్టమైన వాహనాల లిస్టు ఉన్నప్పటికీ నోటీసులు జారీ చేయడంలో తాత్సారం చేస్తున్నారు. కండిషన్ లేని వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు.

పాత వాహనాల్లోనే ప్రయాణాలు

జిల్లాలో కాలం చెల్లిన ప్రభుత్వ వాహనాల సంఖ్య 1,350గానే ఉందని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఏప్రిల్‌లో నిబంధనలు వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా 60 నుంచి 70 వాహనాల్ని మాత్రమే స్క్రాప్‌కు పంపినట్లు తెలుస్తోంది. ఇప్పటికీ పాత వాహనాల్లో ఆయా శాఖ అధికారులు, సిబ్బంది ప్రయాణాలు చేస్తూ నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. కాలం తీరిన వాహనాలకు చెక్ పెట్టేందుకు ఆర్టీఏ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్‌తో పాటు ఇతర శాఖ అధికారులతో సమావేశం పెట్టి, ఆదేశాలు జారీ చేసినా ఫలితం లేదు. లేఖలు రాసినా స్పందన లేదు. నిబంధనల గురించి ఉన్నతాధికారుల్ని స్వయంగా కలిసి వివరిస్తామని ఆర్టీఏ అధికారుల మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం



పదిహేనేళ్లు దాటిన ప్రభుత్వ వాహనాల్ని కచ్చితంగా స్క్రాప్‌కు పంపాలి. ఏఏ శాఖల్లో ఎన్ని ఉన్నాయి అనే కోణంలో చర్యలు చేపడుతున్నాం. కాలపరిమితి దాటిన వాహనాలను స్క్రాప్‌కు పంపాలని ఆయా శాఖల అధికారులతో పాటు, జిల్లా ఉన్నతాధికారులను కూడా కోరతాం. ఏపీలో రెండు స్క్రాపింగ్ యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి. ఒకటి గుంటూరు కేంద్రంగా ఏర్పాటు చేశారు.

– షేక్ కరీం, డీటీసీ



గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్సీ సంఘ నాయకులు



నిర్మానుష్యంగా ఉన్న శంకర్ విలాస్ రోడ్డు

ఎస్సీ వర్గీకరణ.. నిరసన సెగలు

ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ మాల సంఘాలు చేపట్టిన భారత్ బంద్ విజయవంతమైంది. రిజర్వేషన్లు ఎత్తివేయాలన్న అగ్రవర్ణ రాజకీయ పార్టీల కుట్రలకు కోర్టు తీర్పు అద్దంపడుతోందని నేతలు విమర్శించారు. అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్న మాల, మాదిగలను వర్గీకరణ పేరుతో విడదీస్తోందని మండిపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

క్లుప్తంగా

బంద్‌తో ఆర్టీసీ ఆదాయానికి గండి

పట్నంబజారు: భారత్ బంద్ నేపథ్యంలో బుధవారం గుంటూరు జిల్లాలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ఉదయం 10 గంటల వరకు అధికారులు బస్సులు బయటకు తీయవద్దని నిర్ణయించిన ఫలితంగా ఆర్టీసీ ఆదాయానికి గండి పడింది. గుంటూరు 1, 2, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోలకు సంబంధించి మొత్తం 393 బస్సులు ఉండగా 250కి పైగా బస్సులు ఉదయం 10 గంటల వరకు నిలిచిపోయాయి. ఈ క్రమంలో కేవలం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ లోనే 130 బస్సుల వరకు నిలిచిపోయాయి. సచివాలయ ఉద్యోగులు, హైకోర్టు ఉద్యోగులు కోసం మాత్రమే బస్సులు తిప్పారు. బస్సులు నిలిచిన క్రమంలో రూ. 35 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు ఆదాయానికి గండిపడిందని అధికారులు తెలిపారు.

గుంటూరు పశ్చిమ డీఎస్పీగా జయరాంప్రసాద్

నగరంపాలెం: గుంటూరు పశ్చిమ డీఎస్పీగా బీఎం.జయరాంప్రసాద్ రానున్నారు. ప్రభుత్వం మంగళవారం నిర్వహించిన బదిలీల్లో విశాఖపట్నం సిటీ తూర్పు ఏసీపీగా ఉన్న జయరాంప్రసాద్ ఇక్కడకు రానున్నారు. గతంలో ఇక్కడ డీఎస్పీగా విధులు నిర్వర్తించిన కేవీ మహేష్‌ను హిందుపూర్‌కు బదిలీ చేశారు. వెయింటింగ్‌లో ఉన్న డీఎస్పీ కె.నాగేశ్వరరావును పల్నాడు జిల్లా నరసరావుపేట సబ్ డివిజన్‌కు బదిలీ చేశారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

చేబ్రోలు: విద్యార్థిని అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు అందించిన వివరాలు.. మండలంలోని నారాకోడూరుకు చెందిన అమ్మాయి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. విద్యార్థిని మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లినట్లు అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు మాయ మాటలు చెప్పి తీసుకువెళ్లినట్లు బంధువులు అనుమానిస్తున్నారు. బాలిక అమ్మమ్మ జి.ముత్తేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ పి.వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5000, గరిష్ట ధర రూ.7000, మోడల్ ధర రూ.6000 వరకు పలికింది.

కుటుంబ వివాదానికి రాజకీయ రంగు

- కోర్టు దావాలను దాచి లోకేష్ ప్రజాదర్బారులో ఫిర్యాదు
- గతంలోనే వివాదాన్ని విచారించిన పోలీసులు

తెనాలి: కుటుంబ సభ్యుల మధ్య ఉన్న ఆస్తి వివాదాన్ని రాజకీయ కక్ష సాధింపునకు వాడుతున్నారు. కోర్టులో ఉన్న దావాలకూ అందుకు మినహాయింపు లేదన్నట్టుగా ఉంది. మంత్రి నారా లోకేష్ నిర్వహించిన ప్రజాదర్బారులో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి పిల్లి అబ్రహాం, అతడి కుమార్తె సుధారాణి 'మెడపై కత్తిపెట్టి ఆస్తిని కబ్జా చేశారు' అంటూ ఇచ్చిన ఫిర్యాదు ప్రత్యక్ష నిదర్శమని సుధారాణి సోదరుడు పిల్లి సుధాకర్, భార్య కృపాజ్యోతి ఆరోపించారు. స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక కార్యాలయంలో బుధవారం రాత్రి విలేకరుల సమావేశంలో కృపాజ్యోతి మాట్లాడుతూ సుధారాణి తనకు ఇష్టం లేకుండా వివాహం చేసుకున్న కారణంగా పిల్లి అబ్రహాం తన మూడు ఇళ్లు, 60 సెంట్ల పొలాన్ని కొడుకు సుధాకర్ పేరిట వీలునామా రాశారని చెప్పారు. ఆస్తి ఉందన్న కారణంగానే తన తల్లిదండ్రులు రూ.5 లక్షల నగదు, వాహనం, ఉంగరం కట్నంగా ఇచ్చి సుధాకర్‌తో తన పెళ్లి జరిపించారని కృపాజ్యోతి చెప్పారు. ఇళ్లపై వస్తున్న అద్దెలో సగం, చెప్పుల షాపులో పనిచేస్తూ వస్తున్న జీతంతో ఇద్దరు పిల్లలు, భర్త, తాను జీవిస్తున్నట్టు తెలిపారు. కొంత కాలం క్రితం ఆస్తి మొత్తం తనదేనని సుధారాణి, ఇల్లు ఖాళీ చేయాలని చెబుతూ వచ్చినట్టు వివరించారు. మరోవైపు సుధారాణి భర్త కోటేశ్వరరావు, తనను భర్తను వదిలేసి, హైదరాబాద్ రమ్మని ప్రలోబపెట్టినా తాను వినలేదన్నారు. దీంతో ఇల్లు ఖాళీ చేయమని ఒత్తిడి చేయటంతో, తాము పోలీసులను ఆశ్రయించినట్లు చెప్పారు. అప్పటి టూటౌన్ సీఐ వెంకట్రావు ఇద్దరినీ విచారించి, సుధారాణిని మందలించి, సోదరుడికి కూడా హక్కు ఉందని చెప్పారని తెలిపారు. సీఐ మాట కూడా వినకుండా ఆమె కోర్టులో దావా వేసిందన్నారు. దీనిపై తాము కూడా కోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. 2022 నుంచి ఓఎస్ 951/22, 692/23, 694/23, 474/23, సీసీ 280/23, 119/23 దావాలు కోర్టులో నడుస్తున్నాయని వివరించారు. వాస్తవాలు ఇలా ఉంటే వారి మెడపై కత్తిపెట్టి కబ్జా చేశామనటం అవాస్తమని వివరించారు.


పిల్లలతో పిల్లి అబ్రహాం కుమారుడు సుధాకర్, కృపాజ్యోతి దంపతులు

కౌలుకు ఇచ్చింది అబ్రహామే...



పిల్లి అబ్రహాంకు ఉన్న 60 సెంట్ల పొలాన్ని ఎంతోకాలంగా నేను సాగు చేస్తున్నాను. నా ఇంటికొచ్చి పొలం కౌలుకు చేయమని అబ్రహామే ఇచ్చారు. ఒప్పందం ప్రకారం ఏటా కౌలు మొత్తం చెల్లిస్తున్నా. కౌలు చేయటం కబ్జా చేసినట్టు ఎలా అవుతుంది?
– అబ్రహాం సోదరుడు పిల్లి తిరుపతయ్య

మరోసారి అక్రమ కేసు కోసం...



నా భర్త గెద్దేటి సురేంద్ర ఒకటో వార్డు కౌన్సిలరు. మేమిద్దరం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లం. మా కుటుంబం 25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంది. ఎన్నికల తర్వాత గొడవల్లో చిలువూరులో జరిగిన హత్య కేసులో నా భర్త పేరు అకారణంగా ఇరికించారు. మళ్లీ ఇప్పుడు ఓ కుటుంబం ఆస్తి వివాదంలో మా భర్త సురేంద్ర, మరిది బాలయ్యపై అక్రమ కేసు బనాయించాలని చూస్తున్నారు. విచారించి తగిన న్యాయం చేయాలి
– గెద్దేటి ఝాన్సీవాణి, కౌన్సిలర్, తెనాలి

జూడాల కొవ్వొత్తుల ర్యాలీ

గుంటూరు మెడికల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడిని ఖండిస్తూ గుంటూరు జీజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె బుధవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరింది. రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులకు, వైద్య సిబ్బందికి రక్షణ లేకుండా పోయిందని జూడా నాయకులు వాపోయారు. వైద్యులు, సిబ్బందిపై దాడులు నిలువరించేలా ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిందితులను తక్షణమే పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. ఏపీ ఎన్జీవో నేతలు, సీఐటీయూ నేతలు, టీచర్స్ యూనియన్ నేతలు జూడాల సమ్మెకు మద్దతుగా బుధవారం ప్లకార్డులు చేతపట్టుకుని నినాదాలు చేస్తూ గుంటూరు నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట మెడికోలు, జూనియర్ డాక్టర్లు నల్లబ్యాడ్జిలు ధరించి ప్లకార్డులు చేతపట్టుకుని బాధితురాలి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూడాల సంఘం నేతలు డాక్టర్ పి.దీక్షిత్, డాక్టర్ అన్వర్‌బాషా, డాక్టర్ రవి, డాక్టర్ నిమ్మి, డాక్టర్ చరణ్, డాక్టర్ మనోజ, డాక్టర్ అశ్విని, డాక్టర్ సరిత, హౌస్‌సర్జన్లు బాబి, దీపిక, ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు మోహన్‌చంద్ర, చరణ్ పాల్గొన్నారు.


గుంటూరు జీజీహెచ్‌లో ధర్నా చేస్తున్న వైద్య విద్యార్థులు


మద్దతు తెలుపుతున్న ఘంటసాల శ్రీనివాసరావు, పక్కన ఏన్జీవో నేతలు

జూడాలకు ఏపీ ఎన్జీవో మద్దతు

గుంటూరు మెడికల్: కోల్‌కతాలో పీజీ విద్యార్థిపై జరిగిన అమానుష ఘటనపై బుధవారం ఏపీ ఎన్జీవో నేతలు నిరసన తెలిపారు. ఈమేరకు గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మెకు తమ మద్దతు ప్రకటించారు. జీజీహెచ్‌కు చేరుకుని జూడాలు చేస్తున్న నిరసన కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపారు. ఏపీ ఎన్జీ జీఓ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్ హాజరై అసోసియేషన్ తరఫున సంఘీభావాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి కేఎన్ సుకుమార్, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, గుంటూరు నగర అధ్యక్షులు ఎస్‌పీఎస్ సూరి, కార్యదర్శి సిహెచ్ కళ్యాణ్ కుమార్, ఎం శ్రీనివాసరావు, గాబ్రియల్, మహిళా విభాగం చైర్పర్సన్ ఎం.రాధా రాణి, కన్వీనర్ లక్ష్మీ రమ్య తదితర ఉద్యోగులు హాజరై వారి సంఘీభావాన్ని తెలిపారు.

ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించిన తెలుగు యువతి

తాడేపల్లిరూరల్: రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని మన రాష్ట్రానికి చెందిన తెలుగు యువతి అధిరోహించి నేడు ఇండియాకు తిరిగి రానున్నట్లు బంధువులు బుధవారం తెలిపారు. వివరాలు.. తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరు వైఎస్సార్ సెంటర్‌లో నివాసముంటూ ఉద్యోగ రీత్యా యు.ఎ.ఇ.లో ఉంటున్న కొండపు మహేష్‌రెడ్డి భార్య కొండపు అన్నపూర్ణ ఈనెల 19వ తేదీన ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి భారత జాతీయ జెండాను ఎగురవేసింది. 14వ తేదీ మొదటి క్యాంప్ ట్రెక్సాల్ 2000 మీటర్లు, రెండవ క్యాంప్‌లో 3857 మీటర్లు, 16,17, 18, 19 తేదీలలో 4,200 మీటర్లు, 19వ తేదీ ఉదయం 7.54లకు మొత్తం 5,642 మీటర్లు(18510 అడుగుల ఎత్తు) పర్వతాన్ని అధిరోహించారు. అన్నపూర్ణ తండ్రి బండారు శ్రీరామచంద్రరావు(లేటు), తల్లి వెంకటేశ్వరమ్మ మొదట నుంచి ఇలా సాహసాలు చేయడంలో, చదువులో ఎంతో ప్రోత్సహించేవారని, ఆ ప్రోత్సాహంతో ఎంఎస్‌సీ(బయోటెక్) పూర్తి చేయడంతో పాటు బీయిడి పూర్తి చేసి ప్రస్తుతం యు.ఎ.ఇ.లో ఇంటర్నేషనల్ ఇండియన్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. భర్త కండ్రపు మహేష్‌రెడ్డి, చిన్నబాబు బాల వెంకట సిద్ధార్థ రెడ్డి ఉన్నప్పటికీ భర్త మహేష్‌రెడ్డి అన్నపూర్ణను ప్రోత్సాహించడంతో నా కుమార్తె అన్నపూర్ణ ఈ సాహసం చేయగలిగిందని తల్లి వెంకటేశ్వరమ్మ తెలిపింది. ఎల్బ్రస్ పర్వతం నిద్రాణమైన అగ్నిపర్వతం ఉన్నప్పటికీ సాహసోపేతంగా ఈ పర్వతాన్ని అధిరోహించడంపై ఆమె స్నేహితులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



భారత జాతీయ జెండాను చూపుతున్న అన్నపూర్ణ

సీకే గరల్స్ హైస్కూలులో వాటర్‌ప్లాంట్ ప్రారంభం




మంగళగిరి: పట్టణంలో సీకే గరల్స్ హైస్కూలుకు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో రూ.2.50 లక్షల విలువైన సురక్షిత తాగునీటి ప్లాంటును బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఇసునూరి అనిల్ చక్రవర్తి, గాజుల శ్రీనివాసరావు, అన్నే రత్నప్రభాకర్, స్కూలు యాజమాన్యం చింతకింది కళ్యాణ్‌కుమార్, వింజమూరి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

పట్నంబజారు: మైనర్ బాలికను అపహరించుకుపోయిన బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. బొంగరాల బీడుకు చెందిన 16 సంవత్సరాల బాలికను అదే ప్రాంతంలో నివాసం ఉండే 17 ఏళ్ల బాలుడు గత వారం రోజుల క్రితం తీసుకుని హైదరాబాద్ వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను తీసుకెళ్లిన ఘటనలో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణం


కానిస్టేబుల్ తారక రామారావు (ఫైల్)

కృష్ణలంక(విజయవాడతూర్పు): లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కానిస్టేబుల్ దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన కృష్ణలంక పరిధిలోని ఐదో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్-1 సెక్టార్‌లో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా మంగళగిరి ఆరో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కొట్నాని తారక రామారావు(39) పటమట, పంటకాలువ రోడ్డులో భార్య నాగజయశ్రీతో నివసిస్తున్నారు. సంతానం లేకపోవడంతో తారక రామారావు సోదరుడి ఇద్దరు కుమారులను దత్తత తీసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఐదు గంటలకు ద్విచక్ర వాహనంపై మంగళగిరి వెళ్లారు. మధ్యాహ్నం విధులు ముగించుకుని భోజనం చేసేందుకు కనకదుర్గ వారధి మీదుగా ఇంటికి బయలుదేరారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వారధి 47వ పిల్లర్ వద్దకు చేరుకోగానే గుంటూరు వైపు నుంచి విజయవాడకు వేగంగా వస్తున్న లారీ ద్విచక్రవాహనంపై వెళ్తున్న తారక రామారావును బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధితులకు న్యాయం చేస్తాం



పిడుగురాళ్ల: బాధితులకు న్యాయం చేసేందుకే తాము ఉన్నామని పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు కక్షిదారులకు భరోసా ఇచ్చారు. పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు బుధవారం పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల మండలంలోని తుమ్మలచెరువు గ్రామానికి చెందిన నల్లమేకల సైదమ్మ హత్య కేసులో కొంత మంది నిందితులను పోలీసులు విచారిస్తున్నారు. ఈక్రమంలో నిందితులకు సంబంధించిన బంధువులు సైదమ్మ హత్యతో నిందితులకు సంబంధం లేదంటూ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. దీనిపై ఎస్పీ వారితో మాట్లాడుతూ... పోలీసుల విచారణ సమయంలో నిజనిజాలు తెలుస్తాయని, అన్యాయంగా ఎవరిని ఇబ్బంది పెట్టేది ఉండదన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని క్రీడా మైదానాన్ని పరిశీలించారు. అలాగే పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించి, పోలీస్‌లకు పలు సూచనలు, సలహాలు అందించారు.

హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన ఎస్పీ

తుమ్మలచెరువు గ్రామంలో నల్లమేకల సైదమ్మ హత్యకు గురైన పొలాన్ని ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. అలాగే హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులను కూడా విచారించారు. ఎస్పీ వెంట పట్టణ సీఐ వెంకట్రావు, మోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి వారికి వితంతు పెన్షన్ అందాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి

నెహ్రూనగర్: అర్హత కలిగి, నిర్దేశిత ధ్రువ పత్రాలు ఉన్న ప్రతి ఒక్కరికీ వితంతు పెన్షన్ అందుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి తెలిపారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు నగరంలో వితంతు పెన్షన్‌లు మంజూరు కాని అర్జీదారులతో, అధికారులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన శిబిరం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గుంటూరు నగరంలో సుమారు 6 వందల మంది వితంతు పెన్షన్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారు తప్పనిసరిగా తమ భర్త మరణ ధ్రువీకరణ పత్రం కూడా దరఖాస్తు చేయాలన్నారు. అర్జీకి జత చేయకపోతే పెన్షన్ మంజూరు కాదన్నారు. పట్టణ పరిధిలో అయితే నెలకు రూ.12 వేలు, గ్రామీణ ప్రాంతం అయితే నెలకు రూ.10 వేల లోపు ఆదాయం కలిగి ఉండి, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు, అన్ని ధ్రువ పత్రాలు అర్జీతో పాటు జత చేసి జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో అందించినా సంబంధిత అధికారులకు పంపి పెన్షన్ మంజూరుకు సహకరిస్తామని తెలిపారు. ఒంటరి మహిళలు కూడా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కొన్నిసార్లు రోడ్ ప్రమాదం జరిగిన సమయంలో ఏ వాహనం ద్వారా జరిగిందో కూడా తెలియకపోతే సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి ఎఫ్ఐఆర్ కాపీతో తహసీల్దార్‌కి అర్జీ అందిస్తే తీవ్ర గాయాలు జరిగిన వారికి రెండు నెలల్లో రూ.50 వేలు, మరణం సంభవిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు అందించడం జరుగుతుందని వివరించారు.

చిన్నారులకు బైక్‌లు ఇవ్వొద్దు..

తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఇష్టానుసారం ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని, ప్రస్తుత చట్టాల ప్రకారం మైనర్లు బైక్‌లు నడిపినా, ప్రమాదాలు చేసినా వారితో పాటు వారి తల్లిదండ్రులకు కూడా శిక్షలు ఉన్నాయని హెచ్చరించారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో 15 నుంచి 17 ఏళ్లలోపు బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, పోక్సో చట్టం ప్రకారం అటువంటి ఘటనల్లో నిందితులకు కఠిన శిక్షలు పడుతున్నాయని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్ ఫోన్‌లు ఇచ్చి వదిలి వేయకుండా, వారితో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థలోని 206 వార్డు సచివాలయాల పరిధిలో ఆరు వందల మంది వితంతు పెన్షన్ దరఖాస్తులు ఉన్నాయని, వాటిలో ఎక్కువ శాతం క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేశామని వివరించారు. వితంతు పెన్షన్ మంజూరుకు తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు ఉండాలన్నారు. నగర పరిధిలో ఎవరైనా ఇంకా దరఖాస్తు చేయకుంటే స్థానిక వార్డు సచివాలయంలో అర్జీలు అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి, న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు, నగరపాలక సంస్థ ఉపా సెల్ పీఓ వేణుబాబు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ సర్వే సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక చర్యలు


జేసీ భార్గవ్‌తేజ్‌తో కలసి టౌన్ ప్లానింగ్ అధికారులతో చర్చిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో ఖాళీ స్థలాలకు సంబంధించిన సర్వే సబ్ డివిజన్ సర్టిఫికెట్ల సమస్య శాశ్వత పరిష్కారం చూపుతామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్, డిస్ట్రిక్ట్ రిజిస్టర్ డి.శైలజ, ఏడీ సర్వే వై.నాగశేఖర్, నగర పాలక సంస్థ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్‌లతో నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశమయ్యారు. నగర పాలక సంస్థ, విలీన గ్రామాలలో గత కొంత కాలంగా ఖాళీల స్థలాలకు సంబంధించిన సబ్ డివిజన్ సర్టిఫికెట్ల మంజూరు విషయంలో నగర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యల శాశ్వత పరిష్కారం కోసం క్షుణ్ణంగా సమీక్షించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇకపై నగర పాలక సంస్థ పరిధిలో, పది విలీన గ్రామాల పరిధిలోని నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌కు సంబంధించిన టీఎస్ నంబర్, డీ నంబర్లకు సంబంధించిన ఖాళీ స్థలాలకు నగర పాలక సంస్థ సబ్ డివిజన్ సర్టిఫికెట్లు జారీ చేస్తుందని, తహసీల్దార్ కార్యాలయం రెవెన్యూ విభాగం వారు గుంటూరు నగరంలో, విలీన గ్రామాలలోని డీ నంబర్ కలిగిన వ్యవసాయ భూములకు మాత్రం సబ్ డివిజన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని నిర్ణయించారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి 22ఏ, 22ఈ భూ వివరాలను నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు సేకరించాలని చెప్పారు. ఖాళీ స్థలాల సర్వే కోసం వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శుల ద్వారా తనిఖీలు నిర్వహించి టౌన్ సర్వేయర్ అప్రూవల్‌తో పట్టణ ప్రణాళిక అధికారులు సర్టిఫికెట్లు జారీ చేస్తారన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్ని జిల్లా కలెక్టర్ వారి ఆమోదం అనంతరం సర్టిఫికెట్ల జారీ అమలులోకి వస్తుందన్నారు. నగర పాలక సంస్థలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో ఏసీపీ అజయ్ కుమార్, టీపీఎస్ రసూల్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయండి

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్

తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ విలేజ్, వార్డు సెక్రెటరీస్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా పినపాడులోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం సాయంత్రం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు రెండు ఇంక్రిమెంట్‌లు రావాల్సి ఉందని తెలిపారు. వాటిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై మాతృ శాఖ అజమాయిషీ మాత్రం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తెనాలి పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా షేక్ జానీబాషా, ఉపాధ్యక్షులుగా ఎన్.అజయ్‌కుమార్, వి.భాస్కర్, కె. నాగరాజు, కార్యదర్శిగా కె. ధర్మేంద్ర సాయి తదితరులు ఎన్నికైనట్లు నాయకులు తెలిపారు.

సిలబస్‌పై అవగాహన అవసరం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


ఎడ్యుకేషన్ సైకాలజీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

తెనాలిఅర్బన్: డీఎస్సీ సిలబస్‌పై అభ్యర్థులు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదికల సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు కొత్తపేటలోని ఎన్జీవో హోంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ముఖ్యమైన వార్త పత్రికలను చదువుతూ నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలని సూచించారు. అలాగే గతంలో ఇచ్చిన పేపర్స్ ప్రశ్నల సరళిని గమనించాలని కోరారు. డీఎస్సీ తప్పకుండా జరుగుతుందని చెప్పారు. అనంతరం ఎడ్యుకేషనల్ సైకాలజీ అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. వీటిని ప్రతి పాఠశాలకు పంపుతామని, అవసరమైన వారు దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ, ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు, షేక్ అహ్మద్ హుస్సేన్, గయాసుద్దౌలా, అంగిరేకుల ఉమామహేశ్వరరావు, కె.సాంబశివరావు, దూబ సందీప్, షేక్ కరిముల్లా, డీవీఆర్ ప్రసాద్, వెలువల సుబ్బారావు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకే పురస్కారాలలో మెరిసిన వీవీఐటీ


జేఎన్‌టీయూకే పురస్కారాలు అందుకున్న వారితో కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: జేఎన్టీయూకే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీ నిర్వహించిన వేడుకల్లో భాగంగా అనుబంధ కళాశాలలకు అందించిన పురస్కారాలలో వీవీఐటీ కళాశాలకు బెస్ట్ పర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్, సీనియర్ ప్రిన్సిపాల్ అవార్డుతో పాటు ఉత్తమ అధ్యాపకులుగా అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు పురస్కారాలు అందుకున్నారని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వీవీఐటీలో బుధవారం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ కాకినాడలో నిర్వహించిన జేఎన్టీయూకే 17వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ కె.రామ్మోహనరావు, జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ చేతులమీదుగా ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు గిరిబాబు, శ్రీనివాసరావు ఈ పురస్కారాలను అందుకున్నారని వివరించారు. అనంతరం పురస్కారాలను పొందిన అధ్యాపకులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సెక్రటరీ ఎస్.బదరీ ప్రసాద్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్ అభినందించారు.